నవతెలంగాణ
ఆదిలాబాద్
సోమవారం | అక్టోబర్ 16, 2023 | www.navatelangana.com

గిరిజనేతరుల సంఘం అధికార ప్రతినిధిగా దుర్గం శేఖర్

నవతెలంగాణ-ఆదిలాబాద్అర్బన్



రాష్ట్ర గిరిజనేతరుల సంఘం అధికార ప్రతినిధిగా దుర్గం శేఖర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు భరత్ వాగ్మరేతో పాటు జాడి రాజారెడ్డి ఇతర నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గం శేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని తెలిపారు. గిరిజనేతరుల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానని వివరించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టివేత

నవతెలంగాణ-దస్తురాబాద్



మండలంలోని మున్యాల గ్రామంలో మద్యం అక్రమంగా అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో ఆదివారం ఎస్సై తన సిబ్బందితో కిరాణాషాపు తనిఖీ చేయగా సాయిని నరేష్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం లభ్యమయింది. దీనితో అతనిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నికల నియమావళి ఉన్నందున అక్రమంగా మద్యాన్ని అమ్మిన, నిల్వ ఉంచిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. పట్టుబడిన మద్యం 15.55 లీటర్లుగా, దీని విలువ సుమారు రూ.8,490గా గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉట్నూరుకు చెందిన యువకుడు మహమ్మద్ నదీమ్ (25) మృతి చెందాడు. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం... ఉట్నూర్ పట్టణానికి చెందిన అజ్మోద్దీన్ కుమారుడు నదీమ్ స్థానిక ఓ ఇంజనీర్ వద్ద తాత్కాలిక ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడు హస్నాపూర్ ప్రాంతంలో జరుగుతున్న పనులను చూడటానికి ద్విచక్రవాహనం (టీఎస్-01ఈజె 1098)పై వెళ్తుండగా, వెనుక నుంచి వస్తున్న ఎరిటీగా కారు(టీఎస్ 20సీ 7933) ఆ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు నదిమ్‌కి బలమైన దెబ్బలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సంఘటన వివరాలను వాహనదారులు తమకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకొని కారు డ్రైవర్ విజయ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోహర్ తెలిపారు. కాగా మృతుడు అందరితో కలిసిమెలసిగా ఉండే వాడని కుటుంబానికి తన వంతు బాధ్యతగా ఆసరాగా ఉందామని ఎప్పుడు ఎదో పని చేస్తూ ఉన్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల తోటి స్నేహితులు, బంధువులు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాహనదారులు నెమ్మదిగా, ఇరువైపులా గమనించుకుంటూ వెళ్లాలని పోలీసులు సూచించారు.

బిఫామ్ అందుకున్న జాన్సన్ నాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం కేసీఆర్ ఆదివారం పార్టీ బిఫామ్‌లు ప్రగతి భవన్‌లో అందించారు. పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన భూక్య జాన్సన్ నాయక్‌కు హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బిఫామ్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ అధిష్టానం, సీఎం కేసీఆర్, కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, కేసీఆర్ ఆశిస్సులతో నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షునిగా బామ్ని అనిల్

నవతెలంగాణ-భైంసా

నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీ బంకెట్ హాల్‌లో నిర్వహించిన ఈ ఎన్నికలో అధ్యక్షునిగా బామ్ని అనిల్, ఉపాధ్యక్షునిగా షేక్ ఇస్మాయిల్, పీఆర్ఓగా జెల్ల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా షేక్ హయాత్, క్యాషియర్‌గా గంధం వెంకట్‌లను ఎన్నుకున్నారు. వీరిని కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించి, అభినందించారు.

మూడు ఖరారు..ఏడు వాయిదా..!

- కాంగ్రెస్ టికెట్ల తొలి జాబితా విడుదల
- మంచిర్యాల నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, నిర్మల్ శ్రీహరిరావు
- బెల్లంపల్లి నుంచి గడ్డం వినోద్‌కు దక్కిన అవకాశం
- మిగిలా స్థానాలకు 18న వెల్లడించే ఛాన్స్
- మలి జాబితాపై ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ



సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా.. కేవలం మూడు స్థానాలకే అభ్యర్థులను ఖరారు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంచిర్యాల టికెట్‌ను మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు కేటాయించగా.. బెల్లంపల్లి టికెట్‌ను మాజీ మంత్రి గడ్డం వినోద్‌కు..నిర్మల్ నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుకు కేటాయించింది. కాంగ్రెస్ అధిష్టానం తొలి జాబితాలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 55 స్థానాలకు మాత్రమే టికెట్లు ప్రకటించగా.. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి మూడింటిని మాత్రమే ఎంపిక చేసింది. మిగితా ఏడు స్థానాల టికెట్ల కేటాయింపును వాయిదా వేసింది. ఈ జాబితాను కూడా నెల 18వ తేదీన వెల్లడించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోపక్క టికెట్లు దక్కిన వారు సంతోషం వ్యక్తం చేయగా.. వాయిదా పడిన స్థానాల్లో మాత్రం ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసింది. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ పార్టీ పది అసెంబ్లీ స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. అధికార పార్టీ అభ్యర్థులకు పోటీదారులుగా నిలిచే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించడంతో ఆ పార్టీలు కొంత ఆలస్యం చేశాయి. దీంతో అధికార పార్టీ అభ్యర్థులకు ఎవరు పోటీదారులుగా ఎవరు బరిలో నిలుస్తారోననే జనంలో ఆసక్తి కనిపించింది. తాజాగా కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాను విడుదల చేయడంతో ఉత్కంఠకు కొంత తెరపడినట్లయింది. ఎలాంటి అసమ్మతి..ఇబ్బంది లేని స్థానాలను మాత్రమే మొదటి జాబితాలో ఆ పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించిందనే ప్రచారం జరుగుతోంది. మంచిర్యాల నుంచి మొదటి నుంచి వినిపిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావుకే పార్టీ టికెట్ కేటాయించగా.. బెల్లంపల్లిలోనూ పెద్దగా అసమ్మతి లేకపోవడంతో మాజీ మంత్రి గడ్డం వినోద్ పేరును ప్రకటించింది. ఇక నిర్మల్ జిల్లాలో ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్‌లో కీలక నేతగా వ్యవహరించిన కూచాడి శ్రీహరిరావు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక్కడా ఇతర నాయకుల నుంచి పెద్దగా అసమ్మతి లేకపోవడం కారణంగా నిర్మల్ అభ్యర్థిగా శ్రీహరిరావు పేరును ఆ పార్టీ అధిష్టానం వెల్లడించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏడు స్థానాలపై ఉత్కంఠ..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా కాంగ్రెస్ తొలి జాబితాలో కేవలం మూడింట మాత్రమే తన అభ్యర్థులను ప్రకటించింది. మిగితా ఏడు స్థానాల్లో అభ్యర్థుల ఖరారుపై నిర్ణయం వాయిదా వేసింది. ఈ నెల 18వ తేదీన మలి విడత జాబితా వెల్లడిస్తామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం టికెట్లు దక్కనివారిలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఆయా స్థానాల నుంచి పోటీ చేయబోయే అభ్యర్థుల పేర్లు వివిధ పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చినా ఆ పార్టీ అధికారికంగా ప్రకటించకపోవడం కారణంగా ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. కొందరు ఆశావహుల పేర్లు ఖరారయ్యాయని ప్రచారం జరుగుతుండటంతో జాబితాలో ఎవరి పేర్లు ఉన్నాయో తెలుసుకునేందుకు ఆరాటపడుతున్నారు. మరికొందరు ఆశావహులు మాత్రం తమకు టికెట్ దక్కడం లేదనే సమాచారంతో నిరాశకు గురవుతున్నట్లు తెలిసింది. పేర్లు ప్రకటించని స్థానాల్లో కాంగ్రెస్ అధిష్టానం అన్ని కోణాల్లో అభ్యర్థుల వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా చోట్ల సామాజిక సమీకరణాలు, గెలుపు అవకాశాలు, ప్రత్యర్థుల బలాలు తదితర అన్నింటిని పరిగణనలోకి తీసుకుంటోందని సమాచారం. అధికారికంగా జాబితా వెల్లడయ్యే చివరి క్షణం వరకు కూడా టికెట్ ఎవరికి దక్కుతుందో తెలియని పరిస్థితి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మలి విడత జాబితా వెల్లడికి మరో మూడు రోజుల పాటు సమయం ఉండటంతో ఆ లోపు ఆశావహులు అధిష్టానం పెద్దలతో పాటు పార్టీ ముఖ్య నాయకుల ద్వారా టికెట్ దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా టికెట్ దక్కించుకున్న అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేసేందుకు సిద్ధం కాగా .. మిగితా వారు మాత్రం వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది.

పార్టీ మారే ప్రసక్తే లేదు : ఎంపీ సోయం

- ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ జెండా ఎగరేస్తామని ధీమా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాధారణ ఆదివాసీ బిడ్డను ఢిల్లీ వరకు తీసుకెళ్లి ఉన్నత స్థానం కల్పించిన బీజేపీనీ ఎన్నటికీ వదిలిపెట్టి పోనని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు స్థానాలు బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన అసెంబ్లీ విస్తృతస్థాయి సమావేశంలో ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆదిలాబాద్‌లో ఎన్నికల వేడి మొదలైందని, ప్రతి కార్యకర్త తమ పూర్తి సమయాన్ని ఆదిలాబాద్ అభివృద్ధికి కేటాయించాలన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని, పార్టీ మారే ప్రసక్తి లేదని, ఒక గిరిజన బిడ్డను ఢిల్లీ వరకు తీసుకెళ్లిన పార్టీని వీడేది లేదన్నారు. 7 నియోజకవర్గాలను గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో బీజేపీ నాయకులకు మధ్య విభేదాలు ఉన్నట్టు ప్రచారం చేయడం పనిగా పెట్టుకున్నారన్నారు. తమ పార్టీలో ఉన్న ఏ నాయకుల మధ్య విభేదాలు లేవన్నారు. కార్యకర్తలందరూ కంకణం కట్టుకొని పార్టీ గెలుపు దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయర్ విజయ్, మయూర్ చంద్ర, నగేష్, ఆదినాథ్, సుహాసినిరెడ్డి, గంగారెడ్డి, రఘుపతి, రాళ్లబండి మహేందర్, జోగు రవి, రాష్ట్రపాల్, ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్, రాందాస్, సంతోష్, రావిరెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కాలనీల్లో తిరుగుతూ ఆదివారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతినగర్, కొత్త కుమ్మరివాడ, ధన్‌ఘర్ గల్లిలో పర్యటిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరించారు. మహిళలకు వంట గ్యాస్ రూ.500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చేయూత కింద వృద్ధులకు రూ.4000, మహిళలకు రూ.2500 పెన్షన్, ఐదు లక్షల గృహలక్ష్మి పథకాల గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే మొదటి సంతకం 6 గ్యారంటీలపైనే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, అశోక్, సంతోష్, శాకిర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు మోతీరాం, నాయకులు ఉన్నారు.



చెన్నూర్ ఎమ్మెల్యే టికెట్ జాడి యేసయ్యకే ఇవ్వాలి



నవతెలంగాణ-ఉట్నూర్

చెన్నూర్ నియోజకవర్గంలో ఎస్సీ నేతకాని కులస్తుల జనాభా ప్రాతిపదికన బీజేపీ పార్టీ నేతకాని నాయకుడు జాడి యేసయ్యకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించి టికెట్ ఇవ్వాలని తెలంగాణ నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి గంగేష్, జిల్లా అధ్యక్షుడు జాడి కేశవ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఎస్సీ నేతకాని కులస్తుల జనాభా 20వేలకు పైగా ఉన్నారన్నారు. ఆ నియోజకవర్గంలో గెలుపుపోటములకు నేతకాని కులస్తుల ఓటర్లే అత్యంత కీలకమన్నారు. నేతకాని కులానికి చెందిన జాడి యేసయ్య రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న వ్యక్తన్నారు. గతంలో ఆయన నియోజకవర్గంలో జైపూర్ ఎంపీపీగా పని చేశారన్నారు. బీజేపీ అధిష్టానం స్పందించి జాడి యేసయ్యకు అవకాశం కల్పిస్తే భారీ మెజారిటీతో గెలిచే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో ఈ సంఘ నాయకులు ప్రభాకర్, లింగమూర్తి ఉన్నారు.

'బెల్టు' తీస్తున్నారు..!

- పల్లె, పట్టణాల్లో విచ్చలవిడిగా వెలిసిన దుకాణాలు
- ఎన్నికల వేళ విస్తృత తనిఖీలు చేపడుతున్న పోలీసులు
- భారీగా పట్టుబడుతున్న మద్యం..కేసులు నమోదు

ఇన్నాండ్లు ఏరులై పారిన మద్యానికి అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా ఇష్టారీతిన గల్లీగల్లీన వెలిసిన మద్యం బెల్టు దుకాణాలను అరికడుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బెల్టు దుకాణాలను పూర్తిగా నిర్మూలించే పనిలో నిమగ్నమయ్యారు. పోలీసుల తనిఖీల్లో రోజువారీగా గ్రామాలు, పట్టణాల్లో మద్యం సీసాలు పట్టుబడటం కలకలం రేపుతోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రతిరోజూ మద్యం పట్టుబడటం.. సంబంధిత బాధ్యులపై కేసులు నమోదు సాధారణ విషయంగా మారుతోంది. ఇప్పటికే అరికట్టాల్సిన ఆబ్కారీశాఖ అధికారులు అటువైపు దృష్టిసారించకపోవడం మూలంగా మద్యం బెల్టు దుకాణాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. తాజాగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు నిర్వహించిన తనిఖీల్లో వేలాది లీటర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా..మద్యం ఏరులై పారకుండా ఎన్నికల సంఘం గట్టి చర్యలు చేపడుతోంది. ఇప్పటికే జిల్లా నలుమూలల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి అక్రమ మద్యం రవాణాను అరికడుతోంది. దీంతో పాటు డబ్బుల పంపిణీని నిలువరించే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే కొన్ని చోట్ల మద్యంతో పాటు భారీగా నగదు పట్టుబడటం చర్చనీయాంశంగా మారుతోంది. ప్రభుత్వం ప్రతి ఏటా మద్యం దుకాణాల నిర్వహణకు అధికారికంగా అనుమతిస్తోంది. వీటి ద్వారా భారీగా ఆదాయం రాబడుతోంది. కానీ పల్లెలు, పట్టణాల్లోని గల్లీల్లో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకాణాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వం అనుమతించిన మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి గ్రామాలు, పట్టణాల్లో బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా గ్రామాలు, పట్టణాల్లోని గల్లీల్లో ఇష్టారీతిన మద్యం ఏరులై పారుతోందనే విమర్శలున్నాయి. వీటిని అరికట్టాల్సిన ఆబ్కారీశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా పల్లెలు, పట్టణాల్లోనూ బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయనే అపవాదు ఉంది. మరోపక్క మహారాష్ట్ర నుంచి దేశీదారు విక్రయాలు జరుగుతుంటాయి. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పలు చోట్ల దేశీదారు బాటిళ్లను ఆబ్కారీ, పోలీసుశాఖ అధికారులు పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి.

భారీగా మద్యం స్వాధీనం..!

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి పోలీసులు భారీగా అక్రమ మద్యం, నగదు రవాణాపై దృష్టిసారించారు. ఇప్పటికే జిల్లా నలుమూలల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేపట్టడంతో పాటు పల్లెలు, పట్టణాల్లోని గల్లీల్లోనూ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా రోజువారీగా భారీ స్థాయిలో మద్యం, నగదు పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు కేవలం ఆదిలాబాద్ జిల్లాలోనే రూ.4.63లక్షలు విలువ చేసే 666 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోగా.. 101 కేసులు నమోదు చేశారు. ఇందుకు బాధ్యులైన 102మందిని అరెస్టు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పోలీసుల తనిఖీల్లో కేవలం వారం రోజుల వ్యవధిలోనే వందల లీటర్ల మద్యం పట్టుబడటంతో ఎన్నికల పోలింగ్ నాటి వరకు ఏ మేరకు పట్టుబడుతుందోననే చర్చ ఇటు జనంతో పాటు అధికారవర్గాల్లోనూ మొదలైంది.



మరోపక్క ఎలాంటి అనుమతిపత్రాలు లేకుండా రూ.50వేలకు పైగా నగదు తీసుకెళ్లరాదని ఎన్నికల కమిషన్ నిబంధనలు చెబుతున్నాయి. దీంతో అనుమతి పత్రాలు లేకుండా వివిధ పనుల నిమిత్తం సామాన్య జనాలు తీసుకెళ్తున్న డబ్బులను కూడా అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

నవతెలంగాణ-కడెం



మండలలోని లింగాపూర్ గ్రామంలో మిసైల్ మన్ ఆఫ్ ఇండియా మాజీ రాష్ట్రపతి భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు మన భారత దేశంకు కలాం చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కడెం మండల నాయకులు మహమ్మద్ సలీం, షేక్ అన్వర్, అబ్దుల్, వహీద్, బాబర్, అరిఫ్, సమీర్ పాల్గొన్నారు.

ముక్తాసాల్వే 183వ జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్



ఈనెల 29న తాడిహత్నూర్ గ్రామంలో నిర్వహించే వీరనారి ముక్తా సాల్వే 183వ జయంతిని విజయవంతం చేయాలని ముక్తాసాల్వే గ్రామ యూత్ అధ్యక్షుడు గోపాల్ ఇరాళ్లే అన్నారు. ఆదివారం స్థానిక సర్పంచ్ మధుకర్ రాథోడ్ చేతుల మీదుగా జయంతి కరపత్రాలను విడుదల చేశారు. జయంతి ఉత్సవానికి అందరూ సహకరించాలని కోరారు. కరపత్రాలు విడుదల చేసిన వారిలో వైస్ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఉపసర్పంచ్ విష్ణు ఫడ్ గ్రామంలోని వివిధ యూత్ సభ్యులు పాల్గొన్నారు.


టమాటా రైతు కుదేలు..

● నాసిరకం నారు సప్లై చేస్తున్న నర్సరీలు ● ఆదిలోనే వైరస్, తెగుళ్లు ● పెట్టుబడి భారం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఒకప్పుడు టమాటాకు పేరుగాంచిన మండలంలోని ధనోర గ్రామం ప్రస్తుతం పెట్టిన పెట్టుబడి వెళ్లక పోవడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. గతంలో టమాటా సాగుతో పది మందికు ఉపాధి కల్పించిన ఇక్కడి రైతు ప్రస్తుతం గిట్టుబాటు ధర రాక, వైరస్, తెగుళ్ల సోకడంతో అప్పులెలా తీర్చాలని రైతన్న దీనావస్థలో ఉన్నాడు. ఉట్నూర్ డివిజన్ పరిధిలోని ఇంద్రవెల్లి మండలంలో 92.25 ఎకరాలు, గుడిహత్నూర్ మండలంలో అత్యధికంగా 297.07 ఎకరాల్లో టమాటా పంట సాగుచేశారు. అయితే గత జూన్, జూలై నెలల్లో క్యారట్(30) కిలో ధర రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ధర పలికింది. అప్పట్లో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కిలో టమాటా రూ.150 నుంచి 200 వరకు పలకడంతో కొనే వాళ్లు ఒక్క అడుగు ముందుకు ఒక్క అడుగు వెనుక వేసే వారు. అప్పట్లో ఆ టమాటా కర్నాటక, నాసిక్ నుంచి మన జిల్లాకు సప్లై చేశారు. దీంతో వినియోగదారులకు నానా అవస్థలు పడ్డారు. ప్రస్తుతం అదే టమాటా మన దగ్గర బజార్‌హత్నూర్ మండలంలోని టెంబి, భూతాయి, ఖానాపూర్ మండలంలోని పెంబి, ఇంద్రవెల్లిలోని ధనోర, దేవాపూర్, శంకర్‌గూడ, ముత్నూర్, గుడిహాత్నూర్ మండలంలోని జున్ని, కోలారి, తోషం, టాకిగూడ, తదితర గ్రామాల్లో టమాటాను అధికంగా సాగు చేశారు. గత ఆగస్టు నెల నుంచి క్యారట్ టమాటా ధర రూ.100, రూ.200లు దాటడంలేదు. స్టేకింగ్ (ఊత) పద్ధతిలో టమాటా సాగుకు ఒక్కో వెదురు బొంగుకు రూ.15లు, నర్సరీలో ఒక్కో టమాటా నారుకు షాహు రకానికి రూ.1.70 సాహిత్య వంగడానికి రూ.1.0ల చొప్పున రైతులు కొనుగోలు చేశారు. ఇలా ఒక ఎకరం టమాటా సాగు చేయాలన్న రూ.10వేలు నారు అవసరమౌతుంది. దీంతో పాటు ఇతర పురుగుమందులు, ఎరువులు, టమాటా వైరు కట్టడం తదితర ఖర్చులు అదనం. ఒక్క ఎకరం టమాటా సాగుకు రూ.60 వేల నుంచి డెబ్బై వేల వరకు పెట్టుబడి రూపంలో ఖర్చవుతుంది.







పెట్టుబడి ఎల్లడం లేదు..

ప్రస్తుతం మార్కెట్‌లో టమాటా ధర క్యారట్‌కు రెండు వందలు దాటడం లేదు. అంటే రైతు వద్ద నుంచి రూ.5 నుంచి రూ.6కే కొనుగోలు చేస్తున్నారు. ఇది తమకు ఎంతకు గిట్టు బాటు కావడం లేదని, చేసిన పెట్టుబడి సైతం ఎల్లడం కష్టంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు నర్సరీ నిర్వాహకులు నాసిరకం నారు సప్లై చేయడంతో తాము ఆర్థికంగా నష్ట పోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం టమాటా రైతుకు ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

కోల్డ్ స్టోరేజ ఏర్పాటు చేస్తామని మోసగించిన పాలకులు...

-మదినే. బాలాజీ రైతు. శంకర్ గూడ



గతంలో జిల్లా పర్యటనలో భాగంగా మండలానికి వచ్చిన మంత్రి హరీశ్‌రావ్ టమాటా రైతులతో మాట్లాడారు. దనొరలో టమాటా రైతుల కోసం కోల్డ్ స్టొరెజిను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఇక్కడి రైతుల సౌకర్యార్థం టమాటా సాస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామన్న హామీ నేటికీ నేర వెర్చలేదు.

రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా విత్తనాలు సప్లై చేయాలి

-జాయే భాయే. సుభాష్ రైతు శంకర్‌గూడ



గతంలో ఉద్యానవన శాఖ ద్వారా టమాటా విత్తనాలు రాయితీపై పంపిణీ చేసే వారు. రాను రాను దాని సప్లైను ఆపేశారు. సీతాగొంది, గుడిహాత్నూర్, దేవాపూర్‌లో పుట్ట గొడుగుల్ల వెలసిన ఆంధ్రా నర్సరీ నిర్వాహకులపై ఆ శాఖ తనిఖీలు చేపట్టాలి. నాసి రకం నర్సరీలపై చర్యలు తీసుకోవాలి. నారు కొన్న రైతులకు తప్పని సరిగా బిల్లు చెల్లించాలని లేని యెడల అటువంటి నర్సరీలను సీజ్ చేయాలి.

తాటిగూడలో వైద్య శిబిరం



నవతెలంగాణ-పెంబి

మండలంలోని మారుమూల గ్రామమైన తాటిగూడలో ఆదివారం డాక్టర్ రమేష్‌రెడ్డి తిరుమల నర్సింగ్ హోమ్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కనీస బస్సు సౌకర్యం లేని మారుమూల గిరిజన గ్రామమైన తాటిగూడలో జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న 120 మంది గిరిజనులకు ఉచిత వైద్య సేవలందించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల కృష్ణతో పాటు ఎముకల వైద్యుడు డాక్టర్ శివకుమార్, హాస్పిటల్ సిబ్బంది లక్ష్మణ్, రాము, గీత, గ్రామసర్పంచ్ భూక్య తానాజీ, ఉపసర్పంచ్ రాజేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని అన్ని గ్రామాల్లో దుర్గా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంబించారు. ఊరురా దుర్గ మాత విగ్రహాలు ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పొట్టపెల్లి(కె) గ్రామంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలతో పాటు చిన్నారులు మంగళ హరతులు ఇచ్చారు.

రక్తదానం చేసి ఉదారతను చాటుకున్న రవి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రానికి చెందిన మండల బీఆర్ఎస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు సప్పల రవి ఆదివారం రక్తదానం చేసి ఉదారతను చాటుకున్నారు. సోన్ గ్రామానికి చెందిన ప్రియాంకకు ఓ ఆస్పత్రిలో నాలుగు రోజుల కింద పాప పుట్టింది. ఆ పాపకు ప్లాజ్మా తక్కువగా ఉండటంతో ప్రాణాపాయం సంభవించవచ్చని భావించిన డాక్టర్లు రక్తం కావాలని సూచించారు. వెంటనే ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న రవి రక్తదానం చేశారు. పద్నాలుగు సార్లు రక్తదానం చేసిన ఆయనకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నిర్మల్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో అరుగుల రమణ, యుసుఫ్, కట్కం రాజరెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు సమీక్షంలో ఆదివారం ఇతర పార్టీల నుంచి కార్యకర్తలు భారీగా చేరారు. దిలావర్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయానికి చేరుకుని కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ స్థాపించిన నుంచి పార్టీ కీలక నాయకుడిగా ఎన్నో బాధ్యతలు చేపట్టి పార్టీ ఎదుగుదలకు కృషి చేశానని అన్నారు. కానీ మధ్యలో వేరే పార్టీలో గెలిచి వచ్చిన వారికి కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తూ, తమను పక్కన పెట్టారని అన్నారు. అలాంటి మోసపూరిత బీఆర్ఎస్ పార్టీని గద్దె దించడమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ప్రజలు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుగుల రమణ, కట్కం రాజిరెడ్డి, కంజర్ సాయన్న, యూసుఫ్, వసీం, షఫీ, ఈరప్ప, రషీద్, సాజిద్ పాల్గొన్నారు.

నేటి చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్



గిరిజనేతరుల సమస్యల సాధనే లక్ష్యంగా సోమవారం చేపట్టనున్న చలో కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర గిరిజనేతరుల సంఘం అధ్యక్షులు భరత్ వాఘ్మరే పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక దుర్గం ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనేతరులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న నాన్ ట్రైబల్ ప్రజలు భారీ ఎత్తున హాజరుకావాలని కోరారు. మావల ప్రధాన ద్వారం నుంచి కలెక్టరేట్ వరకు భారీ పాదయాత్ర చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేసి గిరిజనేతరుల సమస్యలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించేలా కృషి చేయాలని కోరతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు దుర్గం శేఖర్, జాడి రాజారెడ్డి, నారాయణ దుర్గే, మధాస్తు మహేందర్, రాహుల్ జండదే, అనుదీప్, రఘునాథ్ ఆడే, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబురాలు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని సేవాదాస్ విద్యా మందిర్ పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినులు రంగు రంగుల పువ్వులు తెచ్చి బతుకమ్మను తయారు చేసి బతుకమ్మ పాటలపై నృత్యాలు చేశారు. అనంతరం సమీపంలోని వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ ఉమాజీ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కోసాయి గ్రామానికి చెందిన టేకం లక్ష్మి ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధం అయ్యింది. శనివారం సమాచారం తెలుసుకున్న భరంపూర్ గ్రామస్తులు ఆదివారం గిరిజన కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా కేదరీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీబాయి ఇల్లు పూర్తిగా కాలిపోయిందని అన్నారు. ఆ సంఘటనను చూసి తర్వాత మనసు చలించిపోయిందని అన్నారు. భరంపూర్ గ్రామ యువకులతో మాట్లాడి సాయం అందించాలనే ఉద్యేశంతో తోచిన విధంగా బియ్యం, పప్పులు, చద్దర్లు అందించడం జరిగిందన్నారు. ఇద్దరు కూడా గిరిజన మహిళలు తల్లికూతుళ్ల వితంతులు కావడంతో తమకు తోచిన విధంగా సాయాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సుభాష్, రమాకాంత్, రంజిత్‌రెడ్డి, గ్రామ గిరిజనులు దాంజి పటేల్, నాగారావు, కేశవ్, దేవన్న, దాదారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం దిశగా బీఆర్ఎస్ మేనిఫెస్టో

● మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్



పేదల ఆకాంక్షలకు అనుగుణంగా నిరుపేద ప్రజానికానికి అండగా సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించారని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎన్నికల మేనిఫెస్టో సందర్భంగా సంబురాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే జోగు రామన్నకు బిఫామ్ అందజేస్తున్న క్రమంలో టపాసులు, పేల్చి బ్యాండ్ మేళాలు, డీజే పాటలతో మున్సిపల్ చైర్మెన్‌తో పాటు శ్రేణులు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే జోగు రామన్న 50 వేల మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, సంక్షేమం వంటి ప్రధాన రంగాలకు విశేష ప్రాధాన్యతను ఇవ్వడంతో పాటు మహిళా సంక్షేమం, వ్యవసాయ రంగానికి కూడా పెద్ద పీట వేశారన్నారు.

గంజాయి ప్యాకెట్ల పట్టివేత



నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న గంజాయి 51 ప్యాకెట్లను పట్టుకున్నట్టు ఎక్సైజ్ ఎస్సై లోకానంద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ముందస్తు సమాచారంతో ఎక్సైజ్ ఎస్సై లోకానంద్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా మహారాష్ట్ర నుంచి బజార్‌హత్నూర్ మండలంలోని భూతాయి గ్రామానికి చెందిన ముర్కటి నారాయణ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై గంజాయిని తీసుకువస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. అతని వద్ద నుంచి 51 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఉన్నత అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. దాని విలువ దాదాపు రూ.10వేలు ఉంటుందన్నారు. ఆయనతో పాటు ద్విచక్ర వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ హెచ్‌సీ రమేష్, పోలీసు హెచ్‌సీ విఠల్, కానిస్టేబుల్ రామ్మూర్తి పాల్గొన్నారు.

ఉరేసుకొని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఖానాపూర్

ఉరేసుకొని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తర్లపాడు గ్రామశివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తర్లపాడు గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకొని ఉన్న సమాచారని అందుకున్న పోలీసులు పంచనామ నిర్వహించామని తెలిపారు. మృతుడి వయస్సు 60 నుంచి 70 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, పూర్తి వివరాలు తెలియ రాలేదని అన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై లింబాద్రి తెలిపారు.

ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దేవి నవరాత్రి ఉత్సవాలు జిల్లా కేంద్రంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు దసరా పండుగ తెల్లవారి ముగియనున్నాయి. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని బాపునగర్ శారద గణేష్ మండలి వద్ద నెలకొల్పే అమ్మవారి విగ్రహాన్ని స్థానిక బస్టాండ్ ఎదుట నుండి మహిళలు కోలాటాలతో కోలాహలంగా తీసుకువచ్చారు. వివేకానంద చౌక్‌లో మహిళలు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం రాజుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పుల్లూరి రవి, గీత, ఆశ్విన్, వివేక్, విలాస్, శ్రీనివాస్ గౌడ్, మహేందర్, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అనార్‌పల్లి వాగుపై తాత్కాలిక దారి ఏర్పాటు

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని అనార్‌పల్లి వాగుపై బీఆర్ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఆదివారం తాత్కాలిక దారి ఏర్పాటు చేశారు. వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారింది. దీంత్ జన్కాపూర్, బోరి లాల్ గూడ, శంకర్ లొద్ది, కరంజి వాడ, పెద్ద కరంజి వాడతో పాటు పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన మంజూరైనప్పటికి నేటికి పూర్తి కాలేదు. ప్రజల సమస్యలను గుర్తించిన స్థానిక బీఆర్ ఎస్ నాయకులు, కెరమెరి మాజీ ఉప సర్పంచ్ ఇనూస్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ ట్రాక్టర్ల సహాయంతో వాగు పై తాత్కాలిక దారి నిర్మాణం చేపట్టారు. ఆదివారం వార సంతకావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆటో, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు కొనసాగించారు.

సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి తమ ఉపాధ్యాయ సంఘ సభ్యులంతా సమిష్టి కృషి చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అన్నారు. హైదరాబాదులో ఆదివారం సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని, ఎస్జీటీ ఉపాధ్యాయులకు టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎంటీఎస్ ఇప్పించాలని, ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గించాలని, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఐటీడీఏ సీఆర్టీల సర్వీస్ రెగ్యులర్ చేయాలని, బదిలీలు అయిన ఉపాధ్యాయులను వేంటనే రీలివ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉదయ బాబు, వెంకటేశ్వర స్వామి, అనిల్ కూమార్, రతన్ గైన్, ముంజంపల్లి రమేష్, లకావత్ శంకర్, గోవింద్ రావ్, సంతోష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. అంతర్‌జిల్లా సరిహద్దులలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆదివారం కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు-కాగజ్‌నగర్ రహదారిపై ఎస్పీ సురేష్‌కుమార్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తామని అన్నారు. రూ. 50 వేల కంటే నగదు ఎక్కువగా తీసుకువెళ్ల రాదని, ఒకవేళ తీసుకువెళ్లినా తగిన ఆధారాలు చూయించాలని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ. 67,770 విలువైన 214 లీటర్ల మద్యం, రూ. 14,20,900 నగదు, 182 మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. చెడు నడత కలిగిన వారిని 203 మందిని గుర్తించి బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రశాంత నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు.

తనిఖీలో రూ.1.50 లక్షల నగదు సీజ్

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన సునీల్ సంధ్య కారులో వేములవాడకు పెళ్లికి వెళుతుండగా గోయగావ్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేయగా కారులో రూ.1.50 లక్షల నగదు లభించింది. సరైన ఆదారాలు లేకపోవడంతో డబ్బులను సీజ్ చేశారు. డబ్బులు సునీల్ సంధ్య వేములవాడలోని పెళ్లి షాపింగ్ కోసం డబ్బులు తరలించినట్టు తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో కేసు నమోదుచేసినట్టు ఎస్సై సాగర్ తెలిపారు.

ఎన్‌ఎస్‌యూఐ మండల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బెజ్జూర్

ఎన్‌ఎస్‌యూఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్‌అలీ ఆదేశాల మేరకు ఆదివారం సిర్పూర్ నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ అసెంబ్లీ ప్రెసిడెంట్ అల్లూరి రాజు కమిటీని ప్రకటించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టి వినోద్, ప్రధాన కార్యదర్శిగా టి శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిర్పూర్ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, ఎన్‌ఎస్‌యూఐ మండల ప్రెసిడెంట్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజలకు అమ్మవారి దీవెనలు కలగాలి



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, పట్టణ ప్రజలకు అమ్మవారి దీవెనలు కలగాలని ఏరియా జీఎం మనోహర్ కోరుకున్నారు. దుర్గా నవరాత్రులు పురస్కరించుకొని మందమర్రి పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం దుర్గా దేవిని నెలకొల్పిన సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ దుర్గ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత ప్రతిమను నెలకొల్పుకోవడం జరిగిందని, భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని, రోజువారి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఓటు జీఎం, శ్రీనివాసులు, సివిల్ డీజీఎం జయ ప్రకాష్, సివిల్ ఎస్ఈలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు

నవతెలంగాణ-తాండూర్

కాంగ్రెస్ అధిష్టానం మాజీ మంత్రి గడ్డం వినోద్ వెంకటస్వామికి బెల్లంపల్లి కాంగ్రెస్ టికెట్ ప్రకటించడంపై ఆ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎండీ ఈసాలి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల అభిమానులు కార్యకర్తలు 120మందితో పాల్గొని పటాకులు పేల్చారు.

ఇంకా నిరీక్షణే..!

- కాంగ్రెస్ తొలి జాబితాలో ఖరారు కాని పేర్లు
- రెండు నియోజకవర్గాల ఆశావహుల్లో ఉత్కంఠ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్రవ్యాప్తంగా 55 అసెంబ్లీ స్థానాలకు ఆదివారం కాంగ్రెస్ తొలి జాబితాను వెల్లడించింది. ఈ జాబితాలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు చోటు దక్కలేదు. ఆదివారం విడుదల చేసిన తొలి జాబితాలో సిర్పూరు(టి), ఆసిఫాబాద్ నియోజకవర్గాల అభ్యర్థుల పేర్ల వెల్లడి పట్ల కాస్త సందేహాలున్నా, గ్రూపులను సమన్వయపరిచి అభ్యర్థుల పేర్లను అధిష్టానం వెల్లడి చేస్తుందని భావించారు. కానీ తొలిజాబితాలో పేర్లు లేకపోవడంతో ఆశావహులలో ఉత్కంఠ నెలకొంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సిర్పూరు(టి), ఆసిఫాబాద్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాలలో కాంగ్రెస్ టిక్కెట్‌ను ఇద్దరి కంటే ఎక్కువ మందే ఆశిస్తూ దరఖాస్తులు చేసుకున్నారు. ముఖ్యంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో టిక్కెట్ కోసం పోటీ అధికంగా ఉంది. ముందు నుండి పార్టీలో ఉంటున్న మర్సుకోల సరస్వతితో పాటు రాథోడ్ గణేష్, అజ్మీర శ్యాంనాయక్‌లు తీవ్ర స్థాయిలో టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న వారికే టికెట్ ఇవ్వాలని హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద ఒక వర్గం నాయకులు ఆందోళన కూడా చేపట్టారు. దీంతో ఇక్కడ టికెట్ కోసం పోటీ తీవ్రస్థాయికి చేరుకుంది. ఈ ముగ్గురు కూడా నియోజకవర్గంలో టికెట్ తమకంటే తమకే అని ప్రచారం కూడా చేసుకుంటున్నారు. ఈ ముగ్గురిలో ఒకరికి తూర్పు జిల్లాకు చెందిన ఒక బలమైన నాయకుడు మద్దతు ఇస్తుండగా, మిగిలిన ఇద్దరు



అధిష్టానం ఆశీస్సుల కోసం పైరవీలు చేస్తున్నారు. డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు తటస్థంగా ఉంటూ పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం విడుదల చేసే తొలి జాబితాలో ఈ నియోజకవర్గ అభ్యర్థి పేరు ఖరారవుతుందా లేక ఇంకా జాప్యం జరుగుతుందా అని సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. అనుకున్న విధంగానే ఈ నియోజకవర్గ అభ్యర్థి పేరును అధిష్టానం ఖరారు చేయలేదు. ఇక సిర్పూరు(టి) నియోజకవర్గం నుండి నలుగురు దరఖాస్తు చేసుకున్నా ప్రధానంగా ఇద్దరి మధ్యే పోటీ ఉంది. రావి శ్రీనివాస్, కోరళ్ల కృష్ణారెడ్డి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇద్దరు కూడా పైస్థాయి నుండి పైరవీలు చేసుకుంటున్నారు. ఇటీవలే పార్టీలో చేరిన ఒక సామాజిక వర్గానికి చెందిన గ్రూప్ ఈ నియోజకవర్గంలో తమ సామాజికవర్గానికి చెందిన నాయకునికే టికెట్ ఇవ్వాలని పట్టుపడుతుండగా, పార్టీ గడ్డు పరిస్థితులలో ఉండగా నియోజకవర్గంలో పెద్ద దిక్కుగా ఉన్న నాయకునికే ఇవ్వాలని తూర్పు జిల్లాకు చెందిన ఒక నాయకుడు పట్టుపడుతున్నాడు. ఈ నియోజకవర్గంలో అభ్యర్థి ఖరారుకు మరికొంత సమయం పట్టే అవకాశముంది. మరో పక్క వీరిద్దరూ నియోజకవర్గంలో తానే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినంటూ ఎన్నికల ప్రచారం కూడా చేపడుతుండడంతో ఇక్కడ ఉత్కంఠ నెలకొంది. ఇద్దరిలో ఒకరిని బుజ్జగించి, మరొకరికి తొలి జాబితాలో టికెట్ ఖరారు చేస్తారని ఆశించినా అది జరగలేదు. దీంతో ఈ రెండు నియోజకవర్గాల ఆశావహులు మరికొన్ని రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తింది.

ప్రవళిక ఆత్మహత్యపై రాజకీయం చేయడం సిగ్గుచేటు

- బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్

నవతెలంగాణ-బెజ్జూర్



ప్రవళిక ఆత్మహత్యపై పోలీసులను అడ్డం పెట్టుకొని ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, కవిత మృతురాలి క్యారెక్టర్ అసాసినేషన్ చేస్తూ వ్యక్తిగత దూషణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రవళిక ఆత్మహత్యపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవళిక ఆత్మహత్య అనంతరం పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. విషాదకరమైన పరిస్థితిలో ఓ కుటుంబానికి బాసటగా నిలవాల్సిన ప్రభుత్వం ఆమె వాట్సప్ చాటింగ్ వివరాలు బయటపెట్టి రాజకీయం చేయడాన్ని తప్పుపట్టారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజ్ చేసి రూ.వేల కోట్లకు పేపర్లు అమ్ముకొని చీకటి దందాకు తెరతీసిన టీఎస్‌పీఎస్‌సీ చైర్మెన్, సభ్యులు కేసీఆర్, కేటీఆర్‌తో జరిపిన ఫోన్ సంభాషణ వివరాలను సిట్ అధికారులు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. పోలీసులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే వారి కాల్ డేటా వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పేద వర్గానికి చెందిన ఓ యువతి ఆత్మహత్యపై బీఆర్ఎస్ నేతలు మీడియాలో అబద్ధాలను ప్రచారం చేస్తూ రాజకీయంగా వాడుకుంటున్నారని విమర్శించారు. బీఎస్‌పీ వల్ల నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల తీరుపై మండిపడ్డారు. కేవలం బీఎస్‌పీ వల్లనే గ్రూప్-1తో సహా 16 పరీక్షల పేపర్లు లీకేజీలు బయటపడ్డాయని, గ్రూప్-1 పరీక్ష వాయిదా పడ్డాయని, నిరుద్యోగులకు న్యాయం చేసే పార్టీ బీఎస్‌పీనే అన్నారు. బీఎస్‌పీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీఎస్‌పీఎస్‌సీ రద్దు చేస్తూ తొలి సంతకం చేస్తామన్నారు. కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ ఉద్యమకారులపై కక్ష్యకట్టి ఏ విధంగా రాజకీయంగా దూరం పెట్టారో అదేవిధంగా నిరుద్యోగులను, పోలీసులను అడ్డంపెట్టుకొని కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

బహుజన రాజ్యంతోనే అభివృద్ధి సాధ్యం

దహెగాం : బహుజన రాజ్యంతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని బీఎస్‌పీ రాష్ట్ర చీఫ్, సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఖర్జీ, గిరవెల్లి, గెర్రె, చిన్నరాస్పెల్లి, చంద్రపల్లి, ఒడ్డుగూడ, కొంచవెల్లి, దహెగాం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పలువురు యువకులు ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ సమక్షంలో బీఎస్‌పీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన రాజ్యం సాధించాలంటే బహుజనులంతా ఏకం కావాలన్నారు. రానున్న రోజుల్లో బహుజన సమాజ్‌వాది పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సిర్పూర్ నియోజకవర్గంలో అధికారంలో ఉన్న నాయకులు అభివృద్ధిని ప్రక్కనబెట్టి అక్రమాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. అగ్రవర్ణ ఆధిపత్యాన్ని ఓటు ద్వారా అణచివేసి బహుజన రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అర్షద్‌హుస్సేన్, రాష్ట్ర నాయకులు సిడాం గణపతి, సోయం చిన్నన్న, జిల్లెల తిరుపతి, దుర్గం దేవిదాస్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమాలు పకడ్బందీగా అమలు చేస్తున్నాం

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్
- జిల్లాలో పోలీసులు వాహనాల విస్తృత తనిఖీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమాలు పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో హైవేపై ఆదివారం వాహనాల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తామని, నగదు, మద్యంపై ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, మోడల్ కోడ్ అమలులోకి వచ్చినందున ప్రజలు రూ.50వేల నగదు కంటే ఎక్కువ మొత్తంలో తీసుకెళ్లే వారు పెద్ద మొత్తంలో బంగారం, ఇతర వస్తువులను తీసుకెళ్లేవారు ఆధారాలను చూపాలని తెలిపారు. ఆధారాలు లేని నగదు, ఇతర వస్తువులు, బంగారం ఆభరణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు 214 లీటర్ల మద్యాన్ని స్వాధీన పర్చుకున్నామని వాటి విలువ రూ.67770 ఉంటుందన్నారు. రూ.1420900 ల క్యాష్, 182 మొబైల్ ఫోన్లు సీజ్ చేయడం జరిగిందన్నారు. రౌడీ షీట్, సస్పెక్ట్ షీట్ చెడు నడత గల వారిని 203 మందిని ఇప్పటికే బైండోవర్ చేశామని పేర్కొన్నారు. ఎన్నికలను స్వేచ్ఛ వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

దుర్గామాత ప్రతిష్టాపన

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా, రాళ్లగూడ, చంద్రపల్లి, దహెగాం తదితర గ్రామాల్లో ఆదివారం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ దుర్గామాతను ప్రతిష్ఠించారు. మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంపొందిచాలి



వతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో మానవత విలువలు పెంచే విధంగా కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ మానవీయ విభాగ సంఘ సంచాలక్ మల్లోజుల కిషన్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో వారం రోజుల పాటు శారీరక మానసిక విలువలు పెంచే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మానసిక వికాస శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వికాసం పెంచుకోవడంతో పాటు శారీరక పెరుగుదలకు శిక్షణ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. శారీరక మానసిక ఎదుగుదల సాధ్యమైనప్పుడు సమాజం అభివృద్ధి చెందుతుందని, శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మధుకర్, సభ్యులు కోటేశ్వర్, మధుకర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



ఆసిపాబాద్‌లో..

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ ఆసిఫాబాద్ అభ్యర్థి కోవలక్ష్మికి ముఖ్యమంత్రి కేసీఆర్ బీఫామ్ ఇచ్చిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. పటాకులు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో పేదలకు అండగా ఉండే విధంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కోవలక్ష్మిని అధిక మెజార్టీతో గెలిపించి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపడమే తమ లక్ష్యమన్నారు. అంతకు ముందు జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి ఇంటి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, ఈదులవాడ సర్పంచ్ భీమేష్, నాయకులు సయ్యద్ నిసార్, ఎండీ అహ్మద్, సీహెచ్ రవి, బలరాం నాయక్, సాయి శ్రావణ్, జాకీర్, ఇస్లాం, జావిద్, నజీర్, అమర్ బీన్ అబ్దుల్లా, శంకర్ పాల్గొన్నారు.

దహెగాం : ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన మెనిఫెస్టో తెలంగాణ ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రసాద్‌రాజు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సంతోష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలు, మహిళా, రైతుల అభ్యున్నతితో పాటు అన్ని వర్గాలకు అనుకూలంగా మెనిఫెస్టోను విడుదల చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలు మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు దామోధర్, మల్లేష్, శంకర్, ఆట్కూర్ మధూకర్, జర్పుల సుచిత్, సంతోష్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ తెలంగాణలో రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన మెనీఫెస్టోను ఆదివారం ప్రకటించారు. పోటీ చేసే అభ్యర్థులకు బిఫామ్ పత్రాలను అందించగా అందులో సిర్పూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అందించారు. దీన్ని స్వాగతిస్తు శ్రేణులు పటాకులు పేల్చుతూ, స్వీట్లు తినిపిస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పంద్రం పుష్పలత భిక్షమయ్య, మండల అధ్యక్షుడు సిడాం సకారాం, ప్రాథమిక సహకార సంఘం చైర్మెన్ కుర్సింగ ఓంప్రకాష్, మాజీ సహకార సంఘం వైస్ చైర్మెన్ దందెరా ఇస్తారి, సర్పంచ్ తొర్రెం శంకర్, ఎంపీటీసీ లంగారి శ్రీను, ఉప సర్పంచ్ దుర్గం శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం సత్యన్న, వార్డుసభ్యులు షౌకత్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

కౌటాల : తెలంగాణలో రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన



బెజ్జూర్‌లో..



కౌటాలలో..

మెనీఫెస్టో బీఆర్ఎస్ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదివారం తెలంగాణ భవన్‌లో ప్రకటించారు. అదేవిధంగా తిరిగి పోటీ చేసే అభ్యర్థులకు బీ ఫామ్ పత్రాలను అందించగా అందులో సిర్పూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు బీ ఫామ్ అందజేయడంతో మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు కలిసి కొమురంభీం చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావు, బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెబ్బెన : బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోవలక్ష్మికి బిఫామ్ అందించి, మెనీఫెస్టో విడుదల చేసిన సందర్భంగా మండలకేంద్రంలో నాయకులు పటాకులు పేల్చి, స్వీట్లు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవీ, ప్యాక్స్ చైర్మెన్ కార్నాదం సంజీవ్, మోడెం సుదర్శన్‌గౌడ్, పెసరు మధునయ్య ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, పులికుంట సర్పంచ్ బుర్స పోచమల్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | అక్టోబర్ 16, 2023 | www.navatelangana.com

సినీ ప్రముఖులకు ఘన సన్మానం

నవతెలంగాణ-తాండూర్



మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం దుర్గా దేవి నవరాత్రుల సందర్భంగా దర్శనానికి వచ్చిన ఏకారి ఫిలిమ్స్ డైరెక్టర్ అండ్ ప్రొడ్యూసర్ సత్యనారాయణ, ఓహ్ సినిమా హీరో రఘురాం, విలన్ బిక్షపతి, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ విజయ సేనను ఆలయ పూజారి భాగం శ్రీనివాసశర్మ ఆశీర్వాద మంత్రాలతో కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అభినవ సంతోష్ కుమార్, కాసనగొట్టు బాపూజీ , కొంకోముట్టి సత్యనారాయణ , గండెశ్రీ సత్యనారాయణ, కేశెట్టి సతీష్ కుమార్ పాల్గొన్నారు

ఘనంగా బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-మందమర్రి



సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు మందమర్రిలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు తమ ఇంట్లో తంగేడు, గునుగు పువ్వులతో పాటు వివిధ రకాల పువ్వులతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను తయారు చేశారు. దేవత మూర్తుల వద్ద బతుకమ్మను ఉంచి పూజలు చేశారు. చీకటి పడ్డాక బతుకమ్మలన్నింటినీ ఒక్కచోట పెట్టి పిల్లలు, పెద్దలు ఆనందోత్సాహాలతో బతుకమ్మ ఆడారు.

బాల్క సుమన్ వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసనలు

నవతెలంగాణ-భీమారం

జర్నలిస్టులను కించపరిచే విధంగా చెన్నూర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలపై జర్నలిస్టుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. జర్నలిస్టులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లాలోని ఆయా మండలాల్లో జర్నలిస్టులు నిరసనలు, రాస్తారోకో నిర్వహించారు. బాధ్యత యుత పదవీలో ఉండి పాత్రికేయులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, లేని పక్షంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. భీమారం మండల కేంద్రంలో మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై పాత్రికేయులు నల్ల బాడ్జీలు ధరించి సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. జర్నలిస్టులు మాట్లాడుతూ శుక్రవారం మందమర్రి పట్టణంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో జర్నలిస్టులను వాడు, వీడు, వంకరగా వార్తలు రాసే విలేఖర్లను సక్కగ చేయండి అంటూ రెచ్చగొట్టేల వాఖ్యలు చేయడం సరికాదన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న తమపై బాధ్యత గల పదవీలో ఉండి ఇలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముందునుంచే బాల్క సుమన్ ప్రజలు, అధికారుల పట్ల దురుసుగా వ్యవహరించడం పరిపాటిగా మారిందన్నారు. బాధ్యతారాహిత వాఖ్యలు చేస్తూ ప్రజా స్వామ్యాన్ని అవహేళన చేశారని ఆరోపించారు. బేషరతుగా జర్నలిస్టులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల ఐఖ్యత చాటేల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టులు వేముల భగవాన్‌దాస్, మడిపెద్ది సతీష్, నరహరి సంపత్‌రెడ్డి, తైదల రాజన్న, అయిటిపాముల ప్రవీణ్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : జర్నలిస్టులపై ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, బహిరంగ క్షమాపణ చెప్పాలని క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని స్థానిక అంగడి బజార్ సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వీరికి తెలుగుదేశం పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షులు బి సంజయ్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు ఆరు ముళ్ళ పోశం, నాయకులు జంగపల్లి మల్లయ్య, సతీష్, సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పల్లె రాజు, లాడెన్, సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలువల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిల్ల శ్రీనివాస్, కోశాధికారి పరికిపండ్ల రాజు, ఉపాధ్యక్షులు తూముల భవిష్యత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామిడి సాయి సృజన్, సంయుక్త కార్యదర్శి పోలుదాసరి శ్రీనివాస్, క్లబ్ ఇన్‌చార్జి చొప్పదండి జనార్ధన్, సభ్యులు అనిల్, రాకేష్ పాల్గొన్నారు.

జన్నారం : జర్నలిస్టులపై అనుచిత వాఖ్యలు చేసిన ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పాత్రికేయులకు క్షమాపణాలు చెప్పాలని డిమాండ్ చేస్తు జన్నారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ పార్టీలతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దాదాపు గంట పాటు రాస్తారోకో నిర్వహించడంతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిచిపోయి. రాకపోకలకు అంతరాయం ఏర్పాడింది. ఎస్సై సతీష్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిలువేరి నర్సయ్య, కాంగ్రెస్, బీజేపీ మండలాల అధ్యక్షులు ముజాఫర్ ఆలీఖాన్, గోలి చందు, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి దాసరి తిరుపతి, పాల్గొన్నారు.

• బహిరంగ క్షమాపణ చెప్పాలని జర్నలిస్టుల డిమాండ్



భీమారంలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

నస్పూర్ : జర్నలిస్టులపై చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదివారం నస్పూర్ పాత్రికేయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బి.రాజ్ కుమార్, కే.నారాయణ రెడ్డి, మైదం రామకృష్ణ, కే.శ్రీనివాస్, మిట్టపల్లి మధు, వైద్య శ్రీనివాస్, తలారి సమ్మయ్య, శశి పాల్గొన్నారు.

తాండూర్ : ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సమన్ పాత్రికేయులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఐజేయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐబీలో ఆదివారం పాత్రికేయులు రాస్తారోకో నిర్వహించారు. బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్న పాత్రికేయుల పట్ల బాల్క సమన్ అహంకార ధోరణిని మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు మామిడాల రాజేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూరం దామోదర్ రెడ్డి, పాత్రికేయులు పాల్గొన్నారు.

కాసిపేట : జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ వెంటనే మీడియా జర్నలిస్టులకు బహిరంగా క్షమాపణ చెప్పాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు రవిరాజ్, రాజన్న, లింగస్వామి, తిరుపతి, రమేష్, దినేష్, అనీల్, మోతిరాం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ, నాయకులు సిద్ధం తిరుపతి, గోలేటి స్వామి, మైదం రమేష్ పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్‌లో..



కాసిపేటలో..

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

క్రీడాల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని బెల్లంపల్లి సీఐ ఎస్ రాజ్ కుమార్ అన్నారు. బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో అండర్ 14,17,19 విభాగాల్లో జరుగుతున్న జోనల్ క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. ఆదివారం మూడవ రోజు ఆయా క్రీడాల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు పలు పోటీలను ఆయన ప్రారంభించి ఆటను తిలకించారు. 3వ రోజు క్రీడా పోటీలో అండర్ 14 క్యారంస్ డబుల్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు ఆసిఫాబాద్, ఏటూరునాగారం పొందాయి. చదరంగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు మథని, కోటపల్లి విద్యార్థులు సాధించారు. షాట్‌పుట్‌లో గోల్డ్ కె.సంకేత్ (కాసిపేట), సిల్వర్ జె.వరుణ్ సందేశ్ (జైపూర్), బ్రాస్ మెడల్ జె.సాయి కుమార్(ఆసిఫాబాద్), డిస్కస్ త్రోలో గోల్డ్, సిల్వర్, బ్రాస్ మెడల్స్‌లను కె.సంకేత్ (కాసిపేట), కె.మల్లిఖార్జున్(ఏటూరునాగారం), జె.ఠాగూర్(ఏటూరినాగారం) గెలుపొందారు.100 మీటర్స్ పరుగు పందంలో గోల్డ్, సిల్వర్, బ్రాస్ మెడళ్లను జె.వరుణ్ సందేశ్ (జైపూర్), మధన్ కుమార్(జైపూర్), పి.విష్ణు వర్ధన్ (సిర్పూర్-టి) చేజిక్కించుకున్నారు. బెల్లంపల్లి ఐటీ కంపెనీ వ్యాల్యూ పిచ్ మేనేజర్ జయ చ్చందర్, సుధాకర్, కృష్ణ మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, మంచిర్యాల డీసీఓలు సంగనపట్ల శ్రీనివాస్, రామల బాలభాస్కర్, బెల్లంపల్లి సీఓఈ వైస్ ప్రిన్సిపాల్ కోటా రాజ్ కుమార్, ఆర్సీఓ సూపరింటెండెంట్ గుజ్జుల సమ్మయ్య, రాజు, నవీన్, దత్తప్రసాద్, గురుకులాల ప్రిన్సిపల్స్ లలిత కుమారి, పి జ్యోతి, సీహెచ్. సంధ్యారాణి, సందారాజ స్వరూప, వినోద్ సౌదా, పూటూరి సంతోష్, ప్రసాద్, కె. యాదగిరి, బి. రఘు పాల్గొన్నారు.

గద్దర్, అలీఖాన్ ఆశయాలను కొనసాగిస్తాం



నవతెలంగాణ-నస్పూర్

ప్రజా గాయకుడు యుద్ధ నౌక గద్దర్ (గుమ్మడి విఠల్), లౌకిక ప్రజాస్వామిక హక్కులనేత, సియాసత్ ఉర్దూ పత్రిక ఎడిటర్, భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు జహీర్ అలీ ఖాన్ ఆశయాలను కొనసాగిస్తామని భారత్ బచావో జాతీయ కమిటీ సభ్యుడు జై సింగ్ రాథోడ్ అన్నారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో గద్దర్, జహీర్ అలీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ పోరాటం చేస్తేనే హక్కులు సాధించుకోవచ్చని, పోరాట ప్రతిభను కనబరిచే పాటల ద్వారా పీడిత ప్రజల్లో శక్తిని నింపారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సారధిగా తెలంగాణ పల్లె పల్లెకు పాటల ద్వారా పోరాట స్పూర్తిని నింపారని తెలిపారు. అలాగే మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా ఉద్యమించడంలో అగ్రభాగాన నిలిచిన జహీర్ అలీ ఖాన్, గద్దర్ అంతిమయాత్రలో పాల్గొని గుండెపోటుతో హఠాన్మరణం పొందారని పేర్కొన్నారు. ఇలాంటివారు దేశానికి అవసరమని, ఏకకాలంలోనే ఇరువురిని కోల్పోవడం బాధాకరమన్నారు. మహోన్నతులైన వారి ఆశయాలను భారత్ బచావో ఉన్నంతకాలం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఒడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, భారత్ బచావో జిల్లా చైర్మన్ కనుకుంట్ల మల్లయ్య, ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి టి శ్రీనివాస్, ప్రజా కళామండలి జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కలవేన శ్యామ్, హ్యూమన్ రైట్స్ డిస్టిక్ కన్వీనర్ సుశీల పాల్గొన్నారు.

కేసీఆర్ మాటలను ప్రజలు నమ్మతలేరు

- కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం
- మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్‌రావు
- కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



నవతెలంగాణ-హాజీపూర్

కేసీఆర్ అబద్ధపు మాటలు నమ్మి స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో భారీగా చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రానుందన్నరు. అందుకనే ఇతర పార్టీల నుండి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో హాజీపూర్ ఎంపీపీ, కోఆప్షన్ రఫీక్, నంనూరు గ్రామపంచాయతీ నుంచి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఒడ్డే శ్రీనివాస్ ఆధ్వర్యంలో 500 మంది కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. వార్డ్ మెంబర్స్ పెద్దపల్లి స్వామి, రాచమల్ల రవి గౌడ్, గడ్పూర్ గ్రామం నుండి సింగిల్ విండో డైరెక్టర్ చుంచు పోచం, గ్రామ కోఆప్షన్ నెంబర్ గుర్రం లచ్చిరెడ్డి, గ్రామ యూత్ అధ్యక్షులు పయ్యాల సత్యం, పెద్దంపేట గ్రామపంచాయతీ నుంచి వార్డు మెంబర్లు చొప్పరి చందు, కృష్ణవేణి నారాయణ, భూషణవేణి వంశీ, జక్కుల చంద్రయ్య, చింతకింది రాజయ్య. రాపెల్లి గ్రామం నుంచి నామని రాజేశం, ఉట్నూరి మల్లేష్‌తో పాటు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు.

సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

భవన నిర్మాణ కార్మిక సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను, రాములు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో కోల్బెల్ట్ శ్రీరాంపూర్ ఏరియా భవన నిర్మాణ సంఘం కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీను, రాములు మాట్లాడుతూ సభ్యులందరూ కలిసికట్టుగా ఉంటేనే సంఘం బలోపేతం అవుతుందని, ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటిస్తూ సంఘం ఎదుగుదలకు పాటుపడాలన్నారు. సంఘంలో సభ్యత్వం తప్పనిసరిగా తీసుకోవాలని, సభ్యత్వ రుసుము చెల్లించడం ద్వారా సభ్యులకు కష్టకాలంలో సహాయాన్ని అందించడానికి తోడ్పడుతుందన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి తప్పనిసరిగా లేబర్ కార్డును ఇప్పించాలని, అలాగే గ్రూప్ ఇన్సూరెన్సు చేయించాలని శ్రీరాంపూర్ అధ్యక్ష కార్యదర్శులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం కోల్బెల్ట్ శ్రీరాంపూర్ అధ్యక్షుడు వడ్లకొండ వెంకన్న, ఎమ్మూర్ల కృష్ణ, నాయకులు బాలకృష్ణ, రాజారాం, దేవేందర్, రమేష్, కిష్టయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మేనిఫెస్టో సంబరాలు

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదలను పురస్కరించుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పటాకులు పేల్చి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, ఉప సర్పంచ్ పిట్టల సుమన్, గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, మద్దివేణి వేణు, రాంటెంకి వాసుదేవ్, జాడి రాంచందర్, అక్కెపల్లి బుగ్గరాజు, లంక లక్ష్మణ్, సురేందర్, ఉస్కమల్ల గోపాల్, రాజేశం పాల్గొన్నారు.

దేవాపూర్‌లో..

మండలంలోని దేవాపూర్‌లో బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మడావి అనంతరావు, గ్రామ అధ్యక్షులు వడ్లూరి మల్లేశ్, గోనె రవీందర్, దండవేణి చందు, శ్రవణ్, హైదర్ ఖాన్, కొంగ విజయ్, కొమ్మ సతీశ్, మెరుగు తిరుపతి, జక్కుల మధూకర్, రమేశ్, బాపు పాల్గొన్నారు.



కాసిపేటలో సంబరాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోటపల్లి : బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో సకల జనులందరికీ సంతృప్తిగా ఉందని కోటపల్లి మండల యూత్ అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టో సందర్భంగా మండల కేంద్రంలోని పారుపల్లి వద్ద భారీ ఎత్తున ఆదివారం పటాకులు పేల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. బాల్క సుమన్‌కి చెన్నూరు నియోజకవర్గం బి ఫామ్ ఇచ్చినందుకు సంతోషంగా టపాకాయలతో సంబరాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

భీమారం : మండలంలో బీఆర్ఎస్ మేనిఫెస్టో సంబరాలను ఆ పార్టీ రాష్ట్ర నాయకులు చెరుకు సరోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా పార్టీ మండల అధ్యక్షుడు కలకూర రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై నిర్వహించారు.



భీమారంలో..

పార్టీ కోసం పనిచేసిన వారికే టికెట్ ఇవ్వాలి

నవతెలంగాణ-భీమారం

గెలిచే స్థానం చెన్నూరు నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసిన అభ్యర్థికి టికెట్ కేటాయించాలని ఇతరులకు కేటాయిస్తే ఓటమి పాలవుతామని కాగ్రెస్ మండల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మండ నాయకులు మాట్లాడారు. 1962వ సంవత్సరంలో ఏర్పడిన చెన్నూర్ నియోజకవర్గంలో ఇంతకాలం పార్టీ కోసం పాటుపడిన వారే పోటీ చేశారని గుర్తు చేశారు. కానీ ఈసారీ ఈ స్థానాన్ని హై కామాండ్ ఇతరులకు కేటాయిస్తుందనే సంకేతాలు రావడంతో పార్టీ ఓట్లు ఏటువైపు పడతాయని సందేహం నియోజకవర్గ ప్రజల్లో నెలకొందన్నారు. అభ్యర్థి ఎవరనే బేధం లేకుండా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలనే నియోజకవర్గ ప్రజలకు ఈ వార్త ప్రజల్లో అసంతృప్తిని కలిపిస్తోందన్నారు. ఏనాడైనా ఇక్కడి ప్రజలకు ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే ఇతర పార్టీలపై ఇక్కడి ప్రజలకు పెద్దగా అవగాహన లేదని అన్నారు. ఇలాంటి నిర్ణయంతో పరోక్షంగా బీఆర్ఎస్ పార్టీకి లబ్ధి చేకూరడమే అవుతుందని నాయకులు తెలుపారు. ఇంతకాలం పార్టీని నమ్ముకొని ఉన్న తమను ఇది పార్టీకీ తీరని నష్టం కలిగిస్తుందని అవేధన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో పార్టీ అధిస్టానం పుణరాలోచన చేయాల్సిన అవసరం ఉందని పార్టీ పెద్దలను కోరారు. పార్టీ హైకమాండ్ అభీష్టం మేరకు పార్టీ అభ్యర్థికే చెన్నూర్ టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడిమల్ల వెంకటేశం, దుర్గం లాజర్, గోనే లింగస్వామి జంగపెల్లి చంద్రయ్య కాల్వ శ్రీనివాస్ అనపర్తి రవిందర్, విజయ్ నాయక్, లక్ష్మణ్, రామన్న, కుమార్ గౌడ్, ఉల్లి రాజన్న, శేఖర్, సందీప్, అశోక్, సంపత్ పాల్గొన్నారు.



పోలీస్ ఉద్యోగాల్లో ఎంపికైన వారికి సన్మానం



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో భారత జాగృతి ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగాల్లో ఎంపికైన ఆయా గ్రామాలకు చెందిన అభ్యర్థులను సత్కరించారు. పోలీసు ఉద్యోగాల్లో ఎంపికైన అభ్యర్థులు సమాజ సేవ చేయడానికి మంచి అవకాశంగా భావించి విధుల్లో రాణించాలని భారత జాగృతి జిల్లా అధ్యక్షుగు లింగంపల్లి ప్రేంరావ్ అన్నారు. ఉద్యోగాల్లో ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపి ప్రజా సేవ చేసి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి మండల అధ్యక్షుడు సోదారి సురేశ్, నియోజకవర్గ కన్వీనర్ గంగాధరి రాజ్కుమార్, మండల మహిళా అధ్యక్షురాలు గంగ, కోకన్వీనర్ కనక వంశీకృష్ణ, జీపీ అధ్యక్షులు రత్నం రాజన్న, కుర్సింగ వసంతరావు, కుర్సింగ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళంగా ఎంప్లీఫైర్

మందమర్రి : దసరా శరన్నవరాత్రుల సందర్భంగా పోలమాంబ దేవాలయానికి మంగళంపల్లి అమృత, ముత్యాలు దంపతుల కుటుంబ సభ్యులు ఆలయ పురోహితులు వంశీకి ఆదివారం రూ.23000తో 500వాట్స్ హౌజా ఎంప్లీఫైర్ ని దేవాలయానికి విరాళంగా సమర్పించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | అక్టోబర్ 16, 2023 | www.navatelangana.com

బైంసాలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-భైంసా

పట్టణంలో ఆదివారం బతుకమ్మ పండుగ సంబురాలు ఘనంగా జరిగాయి. పట్టణమంతా పండుగ సందడి వాతావరణం కనిపించింది. బతుకమ్మలను పూలతో అందంగా అలంకరించి, మహిళలు పూజలు చేశారు. మహిళల కోలాటాలు, చిన్నారుల నృత్యాలతో పండుగ కొనసాగింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ



సభ్యులు పవర్ రామారావు పటేల్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలతో కలిసి కాసేపు కోలాటాలు ఆడారు. పట్టణంలోని నలుమూలల నుంచి మహిళలు బతుకమ్మలతో గడ్డెన్న వాగు ప్రాజెక్టు స్థలికి చేరుకున్నారు. ప్రాజెక్టు వద్ద మున్నూరు కాపు మిత్ర మండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. కాసేపు అక్కడే ఆటపాట ఆడి మహిళలు బతుకమ్మలను ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.

బాల్కసుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్

నవతెలంగాణ-భైంసా



మందమర్రిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడిన మాటలకు ఎమ్మెల్యే బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్టుల తఢాఖా చూపిస్తామన్నారు. ఇష్టమచ్చినట్లు నోరు పారేసుకోవడం సరికాదని అన్నారు. క్షమాపణ చెప్పకపోతే తగిన రీతిలో గుణ పాఠం చెబుతామన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి వాఖ్యాలు సరికాదన్నారు. ఇకనైనా బాల్క సుమన్ తీరు మార్చుకొని క్షమాపణ చెప్పాలన్నారు.

పేదల శ్రేయస్సు కోరే ఏకైక పార్టీ కాంగ్రెస్

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బోజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పేదల శ్రేయస్సు కోరే పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీ అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భోజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టో, ఆరు గ్యారంటీలతో పాటు డిక్లరేషన్‌కు సంబంధించిన కరపత్రాలను వారికి అందజేశారు. అధికారంలో వస్తే చేయబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భోజ్జు పటేల్ మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పేదల పక్షనా నిలబడి పోరాటం చేసిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇల్లు, రూపాయికి కిలో బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో దోరల పాలన కొనసాగుతుందన్నారు. రాబోయే రోజులలో సీఎం కేసీఆర్‌ను గద్దెదించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలో వస్తే మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని పేదలకు అందే విధంగా కృషి చేస్తామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖాడే ఉత్తం, పట్టణ అధ్యక్షులు ఎండీ జహీర్, జిల్లా నాయకుడు జితేందర్, మాజీ సర్పంచ్ మెస్రం నాగనాథ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమాసే వెంకటరావు, సేవాదళ్ మండలాధ్యక్షుడు చాహకటి మాణిక్‌రావు, నాయకులు సోన్‌కాంబ్లె బాబాసాహెబ్, శేషనారాయణ్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడిన శిక్షకులు



నవతెలంగాన-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని సాయి వైకుంఠ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రంలో ఆదివారం బతుకమ్మ సందడి నెలకొంది. మగ్గం, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతులు, మహిళలు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సంబరాల్లో ట్రస్ట్ చైర్మన్ డా.రవికిరణ్ యాదవ్ పాల్గొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి చప్పట్లు కొడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ రవి, సభ్యులు శ్రీనివాస్, మహేందర్, రామన్న శిక్షకులు లక్ష్మీ, శ్రావణి, పూజ రాథోడ్, వీణ ఉన్నారు.

సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి

నవతెలంగాణ-రెబ్బెన

రాష్ట్రవ్యాప్తంగా సింగరేణి కార్మికులకు దసరాకు రావాల్సిన లాభాల వాటా 16న చెల్లించాల్సి ఉండగా, ఆ చెల్లింపులను సింగరేణి యాజమాన్యం వాయిదా వేస్తూ సర్క్యులర్ జారీ చేయడానికి ఖండిస్తున్నామని బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మాల్ రాజ్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 4న సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. ప్రతి సంవత్సరం కార్మికులకు లాభాల వాటలు చెల్లించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కానీ ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేశారన్నారు. ఎన్నికల కమిషనర్‌ని కలిసిన వెంటనే లాభాలవాట చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఎం కమిటీ మెంబర్ మంత్ సమ్మయ్య, మారిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

సబ్బండ వర్గాలకు కొండంత అండ



లక్ష్మణచాందలో టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



తలమడుగు : సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

సబ్బండ వర్గాలకు కొండంత అండ కలిగించేలా బీఆర్ఎస్ మేనిఫెస్టో ఉందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మేనిఫెస్టో సంబురాలు నిర్వహించారు. సంక్షేమంలో కేసీఆర్ పాలన స్వర్ణయుగమని అన్నారు. ఇలాంటి పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న పలు పథకాల పరిధిని పెంచేలా, లబ్ధిదారులకు మరింత మేలు జరిగేలా పలు అంశాలను మేనిఫెస్టోలో పొందుపర్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సంపదను పెంచుతూ ప్రజలకు పంచుతున్నామని, ప్రస్తుత పథకాలను అన్నింటిని కొనసాగిస్తూనే, తాజా మేనిఫెస్టోలో అన్ని అంశాలను అమలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం గొప్ప విషయమని అన్నారు. రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా పథకాలతో రైతులందరూ బీఆర్ఎస్ వెంటే ఉన్నారని అన్నారు. రైతుబంధు మరోసారి పెంచుతామని హామీనివ్వడం గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. దీని వల్ల రైతులకు మరింత మేలు జరుగుతుందని తెలిపారు. రైతులను నుంచి మంచి స్పందన వస్తుందని కేసీఆర్‌కే మా మద్దతు అని చెబుతున్నారని వివరించారు. ఆసరా పింఛన్ల పెంపుతో అన్ని వర్గాల్లోని ప్రజల్లో కృతజ్ఞత భావం ఏర్పడుతుందన్నారు. కేసీఆర్ బీమా ప్రతీ ఇంటికి ధీమా, రైతుబంధు పెంపు, ఆసరా పింఛన్ల పెంపు, కేసీఆర్ ఆరోగ్య రక్ష, ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితి రూ.15లక్షలకు పెంపు, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు రూ.3వేల భృతి, పేదలతో పాటు జర్నలిస్ట్ రూ.400కే రాయితీ సిలిండర్, అగ్రవర్ణ కులాల కోసం ప్రతీ నియోజకవర్గానికో గురుకులం, మహిళ స్వశక్తి గ్రూప్‌లకు సొంత భవనంతో పాటు ఇప్పుడున్న సంక్షేమ పథకాలను కొనసాగించడం లాంటి తదితర హామీలివ్వడం తెలంగాణ ప్రజల పట్ల సీఎం కేసీఆర్ చిత్త శుద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్, నాయకులు కల్లెడ భూమన్న, బిట్లింగ్ నారాయణ, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాంసి : సీఎం కేసీఆర్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ప్రవేశ పెట్టిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలను ఉపయోగపడే విధంగా ఉందని బీఆర్ఎస్ తాంసి, భీంపూర్ మండలాల కన్వీనర్‌లు అరుణ్, నాగయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు పార్టీ శ్రేణులతో కలిసి టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. మళ్లీ తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ విజయ కేతనం ఎగురవేస్తుందని అన్నారు. మూడోసారి సీఎం కేసీఆరే అని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు సుధాకర్, రాజు, మండల నాయకులు లస్మన్న, రజినికాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి సదానందం, అనిల్, మహేందర్, రఘు, లింగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలమడుగు : సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులకు బిఫామ్‌లు అందజేశారు. ఆదివారం బోథ్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అనిల్ జాదవ్ బీఫామ్ అందుకున్న సందర్భంగా మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపి టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. మండల కన్వీనర్ తోట వెంకటేష్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులతో పాటు బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేసే విధంగా మేనిఫెస్టోను తయారు చేయడం జరిగిందన్నారు. త్వరలో జరుగబోవు ఎన్నికల్లో అనిల్ జాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేదరీశ్వర్‌రెడ్డి, పాండు, అబ్దుల్లా, కిరణ్‌కుమార్, అశోక్, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, కాటిపెల్లి సునీతరెడ్డి, పల్లవి, దేవన్న, రంజిత్‌రెడ్డి, రమకాంత్, జీవన్‌రెడ్డి, అభిరామిరెడ్డి, శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్నూర్ : ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోవా లక్ష్మికి ఆదివారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫారం పొందిన సందర్భంగా ఎన్నికల మెనిఫెస్టో విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించుకున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేలా మెనిఫెస్టో ఉందని స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కోవ లక్ష్మిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మెన్ సురేష్ ఆడే, మాజీ జెడ్పీటీసీ పుష్కర్ జ్ఞానోబా, ఎంపీటీసీ కొలట్కర్ పరమేశ్వర్, కోఆప్షన్ మెంబర్ దస్తగీర్, ఫ్యాక్స్ డైరెక్టర్ కాంతారావ్ దుర్గే, పార్టీ నాయకులు ఫిరోజ్ ఖాన్, మహేందర్, సయ్యద్ ఖాసిం, మడవి మాన్కు, సుభాష్ రాథోడ్, శివాజీ రాథోడ్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

జైనథ్ : సామాన్యుల ఆకాంక్షలకు అనుగుణంగా, నిరుపేద ప్రజానికానికి అండగా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే జోగు రామన్న భారీ మెజార్టీతో గెలుస్తారని ఎంపీపీ గోవర్ధన్ ధీమా వ్యక్తం చేశారు. మేనిఫెస్టో ప్రకటించడంతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులకు బీఫాంలు అందించిన నేపథ్యంలో మండలంలోని బోరజ్ జాతీయ రహదారి కూడలి వద్ద పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించుకున్నారు. సీఎం చేతుల మీదుగా ఎమ్మెల్యే జోగు రామన్న బీఫాం స్వీకరించగా, వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, పలు గ్రామ సర్పంచ్‌లో ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ : బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ రానున్న ఎన్నికల్లో ప్రకటించే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. దీంతో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ బీఆర్ఎస్సేనని అన్నారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో పార్టీని గెలిపించాలని, అన్ని వర్గాల వారికి సమాన న్యాయంగా మేనిఫెస్టో ఉందని పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు ఓరగంటి పెంటన్న, ఇక్బాల్, బిక్కు, రొహిదాస్, సునీల్, రాజన్న, గోవర్ధన్ పాల్గొన్నారు.

తాండూర్ : బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఆమోదయోగ్యమైన మేనిఫెస్టో ప్రకటించడంపై ఆదివారం ఐబీలో శ్రేణుల సంబురాలు నిర్వహించుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా దుర్గం చిన్నయ్యకు బిఫామ్ అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మూడోసారి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పసాల ప్రణయ్ కుమార్, జెడ్పీటీసీ బానయ్య పాల్గొన్నారు.

సారంగాపూర్ : సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో విడుదల సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు టపాకాయలు పేల్చి సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ బిఫామ్ అందుకున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేయడం మంచి పరిణామమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మాధవ్‌రావు, రైతుబంధు అధ్యక్షులు నల్ల వెంకట్ రామ్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మెన్ మాణిక్‌రెడ్డి, అడెల్లి పోచమ్మ ఆలయ చైర్మెన్ అయిటి చందు, నాయకులు రాజ్ మహమ్మద్, మధుకర్‌రెడ్డి, శంకర్, నర్సారెడ్డి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాసర : మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా జి.విఠల్ రెడ్డి బిఫామ్ తీసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు టపకాయలు సీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నూతనంగా ప్రవేశ పెట్టిన పథకాలే విఠల్‌రెడ్డిని గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రామారావు, బీఆర్ఎస్ కన్వీనర్ కొర్వా శ్యామ్, మల్కాన్న యాదవ్, జిడ్డు మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.



తాంసిలో...



జైనథ్ మండలం బోరజ్‌లో...



సారంగాపూర్‌లో...



సిరికొండలో...

ఫ్లాగ్‌డేను ఘనంగా నిర్వహించాలి : ఎస్పీ

- అమరులైన పోలీసుల ముఖచిత్రాలతో స్థూపం ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అమరులైన పోలీసుల ముఖచిత్రాలతో అతి సుందరమైన నూతన స్తూపం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా పలు ప్రజా కార్యక్రమాలు చేపట్టాలని షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 18న పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పూర్తి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో, జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. జిల్లా పోలీసులు, ప్రజల సహకారంతో ఈనెల 19న స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు, ఈ కార్యక్రమంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అక్టోబర్ 21న స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ప్రజాప్రతినిధులు స్థానిక ప్రజలు కలిసి ఘనంగా నివాళు లర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా పాల్గొంటున్న అమరవీరుల కుటుంబ సభ్యులకు అత్యంత గౌరవంతో ఆహ్వానించి బహుమతుల ప్రధానం చేస్తారని పేర్కొన్నారు. అక్టోబర్ 24 వరకు ఆన్‌లైన్‌లో పోలీసులకు పని - జీవిత సమతుల్యత అనే అంశంపై కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్సై స్థాయి వరకు వ్యాసరచన పోటీలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. సమాజంలో లింగ సమానత్వాన్ని కాపాడటంలో పోలీసుల పాత్ర అనే అంశంపై ఎస్సై, ఆ పై స్థాయి అధికారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించబడతాయని తెలియజేశారు. ఈ వ్యాసరచన పోటీలను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో నిర్వహించాలని, 500 పదాలకు మించకుండా వ్యాసరచనలో పాల్గొని, ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి అవార్డుల ప్రధానం, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత లభిస్తుందని తెలియజేశారు. జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక హెడ్ క్వార్టర్స్ నుంచి ఈనెల 27న సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈనెల 28 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, పోలీసుల విధులు, అత్యవసర పరిస్థితుల్లో చేయాల్సిన పనులు, పోలీసులు చూపిన ప్రతిభ తదితర అంశాలపై విద్యార్థులకు సూచనలు, అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని విద్యార్థిని, విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు, పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫోటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు తగ్గించకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని, ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫోటోలను, వీడియోలను జిల్లాలో బహుమతి ప్రధానం చేస్తూ, రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి రాష్ట్ర పోటీల్లో పాల్గొనే విధంగా అర్హత లభిస్తుందని తెలియజేశారు. ఈ ఫోటోలను వీడియోలను అక్టోబర్ 30లోగా జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో, ఎస్ఐబి, ఐటీ కోర్ కార్యాలయాలలో అందించాలని తెలియజేశారు.



బాసరలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-బాసర



సరస్వతిదేవి అమ్మవారి సన్నిధిలో శారదీయ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారి సన్నిధిలో కొలువైన అమ్మవార్లకు ఆలయ అర్చకులు వేద పండితులు విశేష అభిషేక అర్చన పూజలను నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఆలయ సన్నిధిలోని ప్రత్యేక అక్షరాభ్యాసం మండపంలో ఆలయ అర్చకులు విశ్వేశ్వర పూజ, గణపతి పూజ, క్షేత్ర తీర్థ పూజ, కలశ స్థాపన పూజలు నిర్వహించి, ఘటాస్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మెన శరత్ పాఠక్, ఈఓ విజయరామరావు, నాయకులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనానికి అక్షరాభ్యాస పూజలకు క్యూలైన్లో బారులు తీరారు. ఆలయంలోని కొలువైన అమ్మవార్లను దర్శించుకొని భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం మండపాలలో అక్షరాభ్యాస పూజలు జరిపించారు. అమ్మవారి అన్నదాన సత్రంలో భక్తులు అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

శైలపుత్రి అవతారంలో అమ్మవారి దర్శనం..

నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు మొదటిరోజు ఆదివారం శైలపుత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేద పండితులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.